RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శుక్రవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 127 | ఏప్రిల్ 11, 2025 | వెల : రూ.3-00



యూపీఎస్సీ గెలుపుకు సూత్రాలు

4లో..

- బీఆర్ఎస్ వరంగల్ జిల్లా సారథి పోస్టు ఖాళీ
- కారు గుర్తుపై గెలిచి మధ్యలో పార్టీని వీడిన కడియం శ్రీహరి
- ఉమ్మడి వరంగల్‌లోని 12 సెగ్మెంట్లల్లో.. 11 స్థానాల్లో కాంగ్రెస్
- రెండేండ్లుగా జిల్లా పార్టీ అధ్యక్షుడు లేకుండా కొనసాగుతున్న వరంగల్
- ఓరుగల్లులో పార్టీ రజతోత్సవాల వేళ కార్యకర్తలను నడిపించే నేతపై ప్రశ్నలు




# నడిపించే నాయకుడు ఎవరు?

**వేద న్యూస్, ఫోకస్ టీమ్/వరంగల్ జిల్లా :**

పోరుగల్లు అయిన ఓరుగల్లు నుంచే బీఆర్ఎస్ సత్తా చాటుదామని పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ లీడర్లకు పిలుపునిచ్చారు. గులాబీ పార్టీకి పూర్వ వైభవం గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. కానీ, ఆ పార్టీ కేడర్ మాత్రం నడిపించే నాయకుడు లేకపోవడంతో సతమతమవుతున్నట్టు స్పష్టమౌతోంది. రెండేండ్లుగా వరంగల్ జిల్లాకు పార్టీ అధ్యక్షుడు లేకపోవడంతో ఆ జిల్లా పరిధిలో పార్టీ ప్రోగ్రామ్స్, యాక్టివిటీస్ పెద్దగా కనబడటం లేదు. వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో సైతం నాయకుడు లేక కార్యకర్తలు ఆగమాగం అవుతూ పార్టీ యాక్టివిటీస్ దాదాపుగా నిల్ అయ్యాయి. నడిపించే నాయకుడు లేకపోవడంతో కేడర్‌లో అయోమయం నెలకొందని, కనీసంగా కార్యకర్తలను పట్టించుకునే వారు లేరనే పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నాడు తెలంగాణ ఉద్యమ సందర్భంలో అప్పటి టీఆర్ఎస్‌కు అండగా నిలిచిన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుతం ఏ మేరకు సపోర్టుగా ఉంటుందనేది ప్రశ్నగానే ఉత్పన్నమవుతున్నట్టు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

> ఫొటోలకు ఫోజులు ఇచ్చే లీడర్లే తప్పా నిజంగా ఉద్యమకాలం నుంచి పార్టీనే నమ్ముకున్న వారికి ప్రయారిటీ ఇచ్చే ధోరణి గులాబీ పార్టీలో లేదని, ఉద్యమకారులకు అసలు గౌరవమే దక్కడం లేదని కొందరు బాహాటంగానే వెల్లడిస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల బలాబలాలు పరిశీలిస్తే.. 12 స్థానాల్లో రెండింటా.. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో 'గులాబీ' జెండా ఎగిరింది. కానీ, పార్లమెంటు ఎన్నికల ముందర స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కారు పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంలో గులాబీ కేడర్ నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చినట్టు లోక్‌సభ ఎన్నికలపుడు బీఆర్ఎస్ లీడర్లు చెప్పారు. స్వయంగా కేసీఆర్ సైతం వరంగల్ పార్లమెంటు సెగ్మెంట్‌లో గులాబీ పార్టీ తరఫున క్యాంపెయిన్ చేశారు. కడియం శ్రీహరికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంపైన కడియం శ్రీహరి తనయ కడియం కావ్య వరంగల్ లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పని చేసి, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉన్న అరూరి రమేశ్

మిగతా 4వ పేజీలో..



## 'చలో వరంగల్' సక్సెస్ చేయండి

**బీఆర్ఎస్ శ్రేణులకు ఉద్యమ నేత ఆర్వీ మహేందర్ పిలుపు**

**వేద న్యూస్, గోషామహల్:**

ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత ఆర్వీ మహేందర్ కుమార్ పిలుపునిచ్చారు. 'చలో వరంగల్' సభను ఆయన ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం హొటల్స్ శ్రీ వేదలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీ శ్రవణ్, అంబర్‌పేట్ శాసనసభ్యులు కాలేరు వెంకటేశ్ హాజరయ్యారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ సభకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ ఎస్‌పార్టీ డివిజన్ ల వారీగా ఉన్న నాయకులు, పార్టీ సానుభూతిపరులు, ప్రజలను పెద్ద సంఖ్యలో సభకు తరలించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ సీనియర్ ఉద్యమ నాయకులు యాదగిరి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి శరత్ చంద్ర పవర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు.శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసులకు సహకరించవలసిందిగా కోరారు.ఈ నిషేధ ఉత్తర్వులను చట్టాన్ని ఉల్లంఘించి, ఎవరైనా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## పట్టుబడిన వాహనాలను తీసుకెళ్లండి : సీపీ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ భీమారం, సి.ఆర్ పి. ఎఫ్ కేంద్రంలో భద్రపర్చారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహనాలను తిరిగి అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్లు 8712685143, 8712685158, 8712584557 యజమానులు సంప్రదించాలని పోలీస్ కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహణ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు,జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు పాద యాత్ర నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ముఖ్య అతిథి విత్తనాల అభివృద్ధి సంస్థ చైర్మన్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి లతోపాటు కాంగ్రెస్ నాయకులు,పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్ యు ఐ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి రథోత్సవం

**వేద న్యూస్, మడికొండ :**

ఓరుగల్లు నగరంలో ప్రసిద్ధిగాంచిన దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగినటువంటి ఉత్సవాల్లో గురువారం ముగింపు సందర్భంగా సీతారామచంద్రస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక 46, 64 వ డివిజన్ల కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రథాన్ని పూలతో అలంకరించారు. ఈ రథోత్సవంలో మహిళలు కోలాటాలతో, డప్పు చప్పుల్లతో, పోతురాజుల డాన్సులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడికొండ సిఐ, పోలీస్ సిబ్బంది, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్, ఆలయ ధర్మకర్తలు, ఆలయ కార్య నిర్వాహణాధికారి, పూజారులు, ఆలయ సిబ్బంది, మాజీ కార్పొరేటర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు, యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎర్రజెండా భూ పోరాటాల వల్లనే పేదలకు భూములు

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఓ కమ్యూనిటీ హాల్ లో గురువారం రోజున జక్కు రాజు గౌడ్ అధ్యక్షతన గ్రామ శాఖ సిపిఐ మహాసభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు హాజరయ్యారు. మొదటగా ఆయన సిపిఐ ఎర్రజెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో సిపిఐ ఆవిర్భావం జరిగి వందేళ్లు పూర్తికావస్తున్నదని, ఈ వందేళ్ళ సిపిఐ ప్రయాణంలో ప్రజల కోసం ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలు చేసిందని అన్నారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి దాన్ని విజయవంతం చేసి లక్షలాది ఎకరాలను పేద ప్రజలకు పంచిందన్నారు. జాతీయస్థాయిలో భూ పోరాటాలకు పిలుపునిచ్చి అలుపెరుగని పోరాటాలు చేసి భూసంస్కరణల అమలులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని స్పష్టం చేశారు. భారతదేశంలో సిపిఐ ఆవిర్భావం, ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం ఒకే కాలంలో జరిగిన ఆర్ఎస్ఎస్ మతాన్ని అడ్డుపెట్టుకొని మతం పేరుతో రాజకీయాలు చేసిందని, కానీ సిపిఐ మాత్రం విలువలు కలిగిన గౌరవప్రదమైన రాజకీయాలు మాత్రమే చేసిందని, కుల, మత, వర్ణ, వర్గ, లింగ బేధాలు లేకుండా నిరంతరం పేద ప్రజల కోసమే పని చేసిందని అన్నారు. రాజకీయాల్లోకి వ్యాపారులు, కార్పొరేట్ శక్తులు చొరబడి రాజకీయాలను వ్యాపారంగా మార్చిపడేశాయని, అలాంటి కార్పొరేట్ శక్తులే దేశాన్ని పాలించే నాయకులకు ఆర్థిక పరంగా అండదండగా ఉంటున్నారని, ఆ కారణంగానే అటవీ సంపదనంతా వారికి దోచిపెడదామనే దురుద్దేశంతోనే నక్సలైట్లను అంతమొందిస్తా అని అమిత్ షా బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని, అలాంటి బహిరంగ వ్యాఖ్యలు ఎన్ని చేసినా కూడా భూమి కోసం పోరాడే కమ్యూనిస్టులను, నక్సలైట్లను అంతమొందించడం ఎవరితరం కాదని, ఏడు జన్మలెత్తినా మోడీ, అమిత్ షా కమ్యూనిస్టులను ఏమీ చేయలేరని అన్నారు. నక్సలైట్లు, కమ్యూనిస్టుల పునరేకీకరణ కోసం తాము కృషి చేస్తున్నామని, నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలని పేద ప్రజల తరఫున తమతో కలిసి ప్రత్యక్ష పోరాటాలు చేయాలని కోరారు. కార్పొరేట్ సంస్థలు బకాయి పడ్డ వేలకోట్ల రూపాయల రుణాన్ని మోడీ మాఫీ చేశారని, కానీ పేద ప్రజలకు మాత్రం ఏం సాయం చేయలేదని, పేద ప్రజలకు సాయం చేయకపోగా పెట్రోల్, గ్యాస్ పై అధిక చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండల కార్యదర్శి నకిర్త ఓదెలు, నాయకులు ధర్ముల రామ్మూర్తి, నెట్టెం నారాయణ, బొజ్జం లక్ష్మి, జేరిపోతుల శిరీష, గోలి మహేందర్, మాట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి**

సిపిఎం సిరిసిల్ల జిల్లా కార్యదర్శి ముషం వివరాలు : 4లో..

# పవర్ కోసం ప్రతిపక్షాల పాకులాట

హైదరాబాద్ : మూడేళ్లలో మేము పవర్ లోకి వస్తున్నాం.. మీ సంగతి చూస్తాం. ఇంకా నాలుగేళ్ల టైముంది. కళ్ళు మూసుకుంటే నాలుగు రోజులుగా అయిపోతాయి. మళ్లీ మనమే పవర్ లోకి వస్తాం. రాగానే వాళ్ల తోలు తీస్తాను. ఆ ఎస్ ఐ పేరు గుర్తుపెట్టుకోండి... మూడేళ్ల తర్వాత పవర్ లోకి రాగానే వాడిచేత మీకు సెల్యూట్ కొట్టిస్తా. తెలుగు రాష్ట్రాల్లో ఈమధ్య బాగా వినబడుతున్న మాటలు ఇవి. ఏపీలో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిరోజు.. మూడేళ్లలో పవర్ లోకి వచ్చేస్తాం.. రాగానే వాడి సంగతి చూస్తాం. వీడి సంగతి చూస్తాం.. అది కట్టిస్తాం.. ఇది పడగొడతాం అని హామీల మీద హామీలు ఇస్తున్నారు.లో ఉన్న ఈ పొలిటికల్ పార్టీల ధైర్యం ఏమిటో మాత్రం ఎవరికి అర్థం కావటం లేదు. క్యాడర్ లో ఊపు తేవడానికి, నమ్మకం కలిగించడానికి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారా.. లేక అధికార పక్షాన్ని బెదిరించి మైండ్ గేమ్ ఆడుతున్నారా అన్నది జనంలో చర్చ నడుస్తోంది. ప్రభుత్వం చేస్తున్నది తప్పు అని అనిపిస్తే ఆ తప్పుని అడ్డుకోవడంపై విపక్షాలు దృష్టిపెట్టడం లేదు. మేము వచ్చాక అలా చేస్తాం, ఇలా చేస్తాం అని బెదిరించడం చాలా మామూలు అయిపోయింది. అంటే మూడేళ్ల తర్వాత వీళ్ళు వస్తే మళ్లీ పగ ప్రతీకారాలు కొనసాగుతాయన్నమాట.ఇప్పుడు వాళ్ళని వీళ్ళు వేసుకుంటారు. మూడేళ్ల తర్వాత వీళ్లు వాళ్ళని వెంటాడుతారు అన్నమాట. అధికారంలోకి వస్తే ఏం చేస్తాము అన్నది పొలిటికల్ పార్టీలేవి చెప్పడం లేదు. రెండు మూడేళ్లలో మేము అధికారంలోకి వచ్చేస్తున్నాం.. మేము ఆ బుక్‌లో రాస్తున్నాం.. ఈ బుక్ లో రాస్తున్నాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. తెలుగు రాష్ట్రాల్లో అన్ని పార్టీలు ఒక రౌడీ గ్యాంగ్ లాగా తయారయ్యాయి. అసలు వీళ్ళ కాన్ఫిడెన్స్ ఏంటో అర్థం కాదు. ముఖ్యంగా ఏపీలో జగన్మోహన్ రెడ్డి కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరో నెలలోనే మొదలుపెట్టేశారు.నెక్ట్స్ మనమే అధికారంలోకి వస్తాం. రాగానే వాళ్ల సంగతి చూస్తాం. ప్రభుత్వానికి నాలుగున్నర సంవత్సరాలు సమయం ఉంది.164 సీట్లు ప్రభుత్వానికి ఉన్నాయి. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఎవడికి ఏం తెలియదు. అసలు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 9 నెలలు మాత్రమే అయింది. కానీ జగన్మోహన్ రెడ్డి అప్పుడే తొందరపడి పోతున్నాడు. నాలుగేళ్లలో మనమే అధికారం లోకి రాబోతున్నాం రాగానే... వాడి సంగతి తెలుస్తాను. వీడి సంగతి తెలుస్తాను అని హెచ్చరిస్తూ ఉంటారు. ముఖ్యంగా పోలీసు అధికారుల్ని...జగన్ పేరు పెట్టి మరి ఓ వీధి రౌడీలాగా వార్నింగ్ ఇస్తూ ఉంటారు.సరే కార్యకర్తలకు కాన్ఫిడెన్స్ నింపడానికి.. మనం అధికారంలోకి రాబో తున్నాం ధైర్యంగా ఉండండి అని చెప్పొచ్చు. ప్రభుత్వాలు నిన్ను గాక మొన్న ఏర్పడ్డాయి. ఆంధ్రాలో గట్టిగా 9 నెలలు అవ్వలేదు.అప్పుడే జగన్ 2029 లో నేనే అధికారంలోకి వస్తానని పాట పాడుతున్నాడు. ఆయనకు అంత తొందర ఎందుకో అర్థం కాదు. అధికారం లేకుండా ఉండలేకపోతున్నాడా? లేక నిత్యం భ్రమల్లో.. ఊహల్లో బతుకుతున్నాడఇక తెలంగాణ విషయానికొస్తే బి ఆర్ ఎస్ అంచనాలకు మించి ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలు బి ఆర్‌ఎస్ లో విశ్వాసాన్ని నింపేసేయ్. ఎన్నికలకు ఇంకా మూడున్నర సంవత్సరాలు సమయం ఉంది. అయినా సరే టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆగలేకపోతున్నారు. అసలు రేపు ఎల్లుండో ఎన్నికలు జరిగిపోతున్నట్టతాము తిరిగి అధికార పీఠాల్లోకి ఎక్కి కూర్చున్నట్లు వీరావేశంతో హామీలు ఇస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పక్కనే ఉన్న 400 ఎకరాల ప్రభుత్వ స్థలం విషయంలోఒక పక్క ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం వివరణ ఇస్తుండగానే... మరోవైపు కేటీఆర్ కాంగ్రెస్ ఏం మాయ చేసినా సరే అక్కడ స్థలాలు ఎవరూ కొనవద్దు. మరో మూడు ఏళ్లలో మన ప్రభుత్వం వస్తుంది.. ఆ స్థలాన్ని మేము వెనక్కి లాక్కుంటాం అని హెచ్చరిస్తారు. ఆ 400 ఎకరాలు మన ప్రభుత్వం ఎకో పార్క్ కట్టిస్తుంది హామీ ఇచ్చేస్తారు.ఆంధ్ర, తెలంగాణలో ప్రతిపక్షాల ధైర్యం ఏంటో అర్థం కాదు. గతంలో ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాము. ముఖ్యమంత్రిగా పని చేసాము. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాము. మర్యాదగా మాట్లాడాలి. అన్న ధ్యాస ఏ కొసానా లేదు. మూడేళ్లలో మేం అధికారంలోకి వస్తున్నాము.నాలుగేళ్లలో పవర్ లోకి వస్తాము.వాడి తోలు తీస్తాము.వీడుతోలు తీస్తాము.ఆ బుక్‌లోరాస్తున్నాము.. ఈ బుక్ లో ఎక్కిస్తున్నాము..ఇలాఒక రౌడీ గ్యాంగులు తరహాలో హెచ్చరికలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతీకార రాజకీయాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.దీనికి ప్రధాన కారణం ఏ ప్రభుత్వమైనా ఐదేళ్లకు మించి ఉన్నదని అందరి నమ్మకం.వేలకోట్ల రూపాయలు అప్పులు తెచ్చి సంక్షేమ పథకాల అమలు చేస్తూ.. ప్రజలను సంతృప్తి పరచలేక కచ్చితంగా ప్రభుత్వంలో ఉన్న ఏ పార్టీ అయినా ఐదేళ్లకు ఓడిపోక తప్పదు...కనుక జనం ప్రచారంన్యాయంగా మళ్ళీ మనకే ఓటేస్తారు...అందుకే అధికారం మనకు వచ్చేస్తుంది అనే ధీమాతో... ఓడిపోయిన మరుసటి రోజు నుంచే సిగ్గు ఎగ్గు లేకుండా మళ్లీ మనదే అధికారం అని చెప్పు తిరుగుతుంటాయి పార్టీలు. అసలు ప్రజలు మనల్ని ఎందుకు ఓడించారు. వేరే వాళ్ళకి ఎందుకు అధికారమిచ్చారు అన్న సమీక్ష చేయకుండా ప్రభుత్వాలకి ఏడాది నిండకుండానే వీళ్లు వచ్చే ఎన్నికల్లో మాదే అధికారంలో ప్రకటనలు చేస్తున్నారు.

# అంతా జగన్నాటకమే..

**- హెలికాప్టర్ వివాదంపై హోం మంత్రి ఫైర్**

విశాఖపట్నం, ఏప్రిల్ 9: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలైందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని... వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. మాట్లాడితే లా అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని.. గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని.. ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి, అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారని.. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్కృతి అని.. తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించినందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని.. కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని.. అక్కడికి వెళ్తామన్నా కూడా.. తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి.. పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తు చేశారు.

# అత్యంత పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు

తిరుపతి : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరి సమావేశ మందిరం నందు ఎక్సైజ్ అధికారుల రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజి ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. తరువాత మంత్రి మీడియాతో మాట్లాడారు. 2014-19 మధ్య ప్రజలకు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశాం. 2019- 24 మధ్య కాలంలో ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి.. మద్యం వ్యాపారం మొత్తాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. కొత్త పాలసీ పేరుతో వ్యవస్థ మొత్తాన్ని విచ్ఛిన్నం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుండి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్ ఫోర్సు మెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారని అన్నారు. మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి, జే బ్రాండ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారు. జగన్ రెడ్డి అమలు చేసిన మద్యం విధానంతో ప్రభుత్వ ఆదాయం.. ప్రజల ఆరోగ్యం రెండూ తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా పెరిగింది. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం తీవ్రంగా కోల్పోయాం. జే బ్రాండ్ల కారణంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడగా, వేలాది మంది కిడ్నీ, లివర్ సమస్యలతో ప్రాణాలు కోల్పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా జే బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమలవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టాం అత్యంత పారదర్శకంగా డిప్ నిర్వహించి మద్యం షాపుల్ని కేటాయించాం. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90వేల దరఖాస్తులు రాగా, రూ.1800 కోట్ల ఆదాయం వచ్చింది. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించాం. ప్రజలకు ఆరోగ్యం.. ప్రభుత్వానికి ఆదాయం కాపాడే విధంగా పాలసీని తీసుకొచ్చాం. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలించాం.

గత ఐదేళ్లు ఎక్సైజ్ శాఖను విచ్ఛిన్నం చేసి ఎస్‌ఈబీ ఏర్పాటుతో ఎన్ఫోర్స్మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మొన్నటి వరకు గంజాయి అక్రమ రవాణా కారణంగా యువత జీవితాలు చిత్తయ్యాయి గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసుకున్నాం. టూరిజం పెంపు కోసం 3స్టార్ హోటల్ కి లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి 32 వేల కోట్ల అప్పులు చేశారు. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారని అన్నారు.

# పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పించాలి

**- సోలార్ ప్యానల్స్ ఏర్పాటు ద్వారా ఉచిత విద్యుత్ సరఫరా**

**- కిలో వాట్ కు 30 వేలు , 2 కేడబ్ల్యూ కు 60 వేలు, 3 కేడబ్ల్యూ కు 78 వేల సబ్సిడీ**




పెద్దపల్లి : పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కలిపించాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉన్నది. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష దీనిపై పలు శాఖల అధికారులతో సమీక్షా జరుపుతున్న క్షేత్రస్థాయిలో ప్రజలకు దీనిపై అవగాహన శూన్యమేనని చెప్పాలి. ఈ సోలార్ విద్యుత్ ను వాడుకోవడం వల్ల అటు కరెంట్ ఉచితంగా వాడుకోవడం తోపాటు అదనంగా ఉత్పత్తి చేస్తే ఆదాయం కూడా వస్తుందనే విషయం ఎంత మంది ప్రజలకు తెలుసును అనేది ప్రశ్న. అయితే కేంద్రం రేడ్ కో ఆధ్వర్యంలో రాయితీతో కూడిన సోలార్ విద్యుత్‌ను అందిస్తుండగా గతంలో పలువురు లబ్ధిదారులు పోస్టల్ శాఖ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లా నుండి ఆశించిన స్థాయిలోదరఖాస్తులు వచ్చిన, వాటికి సంబందించిన పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. కాగా సోలార్ విద్యుత్ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మరోసారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ తెలంగాణ రెడ్కో ద్వారా పీఎం సూర్య ఘర్ - ముఫ్త్ బీజ్లీ యోజన పథకం అమలు తదితర అంశాలు, ఈ పథకం క్రింద ప్రజలు స్వచ్చందంగా ఇంటి పై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అన్నారు. దానికి ఇస్తున్న రాయితీలను వివరించారు. అయితే 2 కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 150 యూనిట్ల వరకు, 3 కిలో వాట్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే 300 యూనిట్ల వరకు ప్రతి నెలా ఉచితంగా విద్యుత్ పొందవచ్చని అన్నారు. ఇంటి పై ఏర్పాటు చేసుకునే రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, కిలో వాట్ కు 30 వేలు , 2 కే.డబ్ల్యూ కు 60 వేలు, 3 కే.డబ్ల్యూ కు 78 వేల సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ప్రభుత్వం రెడ్కో ద్వారా అందించే వివిధ సబ్సిడీలను వివిధ శాఖల అధికారుల ద్వారా సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సోలార్ ప్లాంట్ ను మన ఇంటి పై ఏర్పాటు చేసుకోవడం ద్వారా మనకు ఉచిత విద్యుత్ అందుతుందని, మన అవసరాలకు మించి అధికంగా విద్యుత్ ఉత్పత్తి చేసే సమయంలో గ్రిడ్ కు విక్రయించడం ద్వారా మనకు ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు. కాగా ఈ పథకం ద్వారా ప్రజలకు ఎంతో కొంత వేలు జరుగుతుందనే విషయాన్ని అధికారులు మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటే విద్యుత్ ఆదాతో పాటు అదనపు ఆదాయం వస్తుందనే విషయం తెలియజేయాలి. వివిధ మాధ్యమాలు, ప్రచార సాధనాలు ద్వారా ప్రజలకు చేరవేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


# ప్రభుత్వ బడులలోనే విద్యార్థులను చేర్పించండి

**- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపు**



జయశంకర్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యంగా జయశంకర్ భూపాలపల్లి విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం ఈరోజు కాటారం మండలంలోని కాటారం గ్రామంలో గౌరవ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంబించి, ర్యాలీని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు అమ్మ ఆదర్శ పాఠశాలలనే పథకం ప్రవేశపెట్టి పాఠశాలల్లో మౌలిక వసతుల సదుపాయాలను కల్పనకు కోట్ల రూపాయలను వెచ్చించి ప్రభుత్వ పాఠశాలకు మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంకను అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ముందుకు రావాలని ఉపాధ్యాయులంతా కలిసి ఉద్యమంలా ఈ బడిబాట కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల లోపల ప్రజల లోపల విశ్వాసాన్ని నమ్మకాన్ని కల్పించేందుకు కృషి చేయాలని కోరారు రాష్ట్రంలో వినూత్నంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ చేపట్టిన ఈ బడిబాట కార్యక్రమం చాలా అభినందనీయమని జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు ఈ బడిబాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు.. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ముద్దమల్ల రాజేందర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అంటే తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగించడం కొరకు ముందస్తుగా ఈ బడిబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని,అన్ని పాఠశాల హెడ్మాస్టర్ లతో నిన్ననే సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించాల్సిందిగా సమాచారాన్ని అందించి, ఈరోజు ఎంతో ప్రతిష్టాత్మకంగా జిల్లాలోని అన్ని గ్రామాలలో అన్ని పాఠశాలల్లో ఈ యొక్క బడిబాట కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించామని, ఈరోజు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మన జిల్లాకు రావడం, బడిబాట కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం చాలా శుభ సూచకమని తెలిపారు.. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు, హెడ్మాస్టర్లు,విద్యార్థిని తల్లిదండ్రులు యువకులు, శ్రేయోభిలాషులు అందరూ ఒక ఉద్యమంలా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ కార్యాలయ అధికారులు అకాడమిక్ మానిటరింగ్ అధికారి కాయిత లక్ష్మణ్ ,సెక్టోరియల్ అధికారులు దుప్పటి రాజగోపాల్ , సి ఎం ఓ సామల రమేష్, జిసిడిఓ శైలజ, మరియు డీసీఇబీ అసిస్టెంట్ సెక్రటరీ కిషన్ రెడ్డి లతో పాటు మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి , కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఉమారాణి , లతోపాటు గ్రామ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్పర్సన్ లు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్



హైదరాబాద్ : తెలంగాణలో మిస్ వరల్డ్ సంబరం అంబరాన్నంటేలా జరగబోతోంది. మే నెల 7వతేదీ నుంచి 31వరకు మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన వివిధ ఈవెంట్లు తెలంగాణలో జరుగుతాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా.. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. చౌమహల్లా ప్యాలెస్ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.హైదరాబాద్ లో జరగబోతున్న మిస్ వరల్డ్ పోటీలకు 120 దేశాలకు చెందిన మోడల్స్ హాజరవుతారు. వీరంతా మే నెల 6, 7 తేదీల్లో హైదరాబాద్ కి చేరుకుంటారు. ప్రారంభ కార్యక్రమంగా మే 7న చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, అనంతరం చౌమహల్లా ప్యాలెస్ వద్ద వెల్కమ్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. 120 మంది మోడల్స్ తో పాటు ఆయా దేశాలకు చెందిన 400 మంది ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఈ కార్యక్రంలో పాల్గొంటారు. వెల్కమ్ డిన్నర్ కి సంబంధించి చౌమహల్లా ప్యాలెస్ లో ఏర్పాటు చేయాల్సిన కార్యక్రమాలపై తెలంగాణ టూరిజం సెక్రటరీ స్మిత సభర్వాల్, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్యాలెస్ లో ఫోటోషూట్ కోసం సీటింగ్ ఏర్పాట్లు, లైవ్ మ్యూజిక్ కాంటెస్ట్, సూఫీ మ్యూజిక్, ఖవ్వాలి మ్యూజిక్ షో ఇక్కడ నిర్వహించబోతున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 20 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల తర్వాత వెల్కమ్ డిన్నర్ ఉంటుంది. తెలంగాణ రుచులతోపాటు, నిజాం వంటకాలు, ఇతర భారతీయ రుచులు కూడా మెనూలో ఉంటాయి.ఇప్పటి వరకు భారత్ రెండుసార్లు మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. మొదటిసారి బెంగళూరులో, తర్వాత ముంబైలో పోటీలు జరిగాయి. మూడోసారి ఈ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషం. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. నెలరోజులపాటు భాగ్య నగరం సందడిగా మారుతుంది. లండన్ కి చెందిన మిస్ వరల్డ్ సంస్థ, తెలంగాణ పర్యాటక శాఖతో కలసి ఈ పోటీలు నిర్వహిస్తుంది. మొత్తం తెలంగాణలో 10వేదికలను గుర్తించగా 8 నుంచి 9 ఈవెంట్లు ఇక్కడ జరుగుతాయి. ప్రారంభ వేడుక, ముగింపు వేడుక హైదరాబాద్ నగరంలో జరుగుతాయి. మిగతా ఈవెంట్లు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో జరిపేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. పర్యాటకంగా తెలంగాణకు ఈ ఈవెంట్ మరింత పేరు తెస్తుందని అంటున్నారు అధికారులు. మిస్ వరల్డ్ పోటీలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.అతిథులకు స్వాగతం, వారి బస ఏర్పాట్లు, ఈవెంట్ల కోఆర్డినేషన్, విదేశీ ప్రతినిధుల సౌకర్యాలు..అన్నిట్లో అప్రమత్తంగా ఉంటున్నారు.నెలరోజుల ముందునుంచే ఏర్పాట్లకోసం కసరత్తులు ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.రాష్ట్రం ఆతిథ్యరంగంలో మరింత ప్రాముఖ్యత సంతరించుకునే అవకాశం ఉండటంతో ప్రభుత్వం పోటీల నిర్వహణలో చొరవ తీసుకుంది. అటు అధికార యంత్రాంగం కూడా ఈ పోటీల నిర్వహణ కోసం టీమ్‌లను ఏర్పాటు చేసింది. పర్యాటకశాఖతోపాటు జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ యంత్రాంగం కూడా పోటీల నిర్వహణకోసం సమాయత్తమైంది.

# పేదల కడుపు నింపేందుకే.. సన్న బియ్యం పంపిణీ

**నర్సాపూర్ లో నూతన రేషన్ షాపు ఏర్పాటు - దూరాబారం తగ్గడంపై గిరిజనుల హర్షం**

తాండూర్ : దశాబ్దాలుగా గిరిజ నులు పడుతున్న ఇక్కట్లు తొలిగాయి. నూతన రేషన్ షాపు ఏర్పాటుతో దూర భారం తగ్గడంపై తో గిరిజన గూడాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి . తాండూరు మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ కేంద్రంలో అధికారులు బుధవారం నూతన రేషన్ షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ముఖ్యఅతిధిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి అమల్లోకి తెచ్చిన సన్న బియ్యం గిరిజనులకు పంపిణీ చేశారు .అనంతరం స్థానిక గిరిజనలు తో కలిసి అధికారులు నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో హరికృష్ణ తాసిల్దార్ ఇమ్రాన్ ఖాన్ లు మాట్లాడుతూ నూతన రేషన్ షాపు ఏర్పాటు పై మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు . ఆయన ప్రత్యేక చొరవ తో ఎమ్మెల్యే గడ్డం వివేక్ సహకారంతో నూతన రేషన్ షాప్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు ఇకపై నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెలకు ప్రతినెల ఇక్కడే రేషన్ సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యాన్ని ఎవరు అమ్ముకోవద్దని అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోషణ పక్వడా కార్యక్రమంలో భాగంగా ఆర్డిఓ హరికృష్ణ తాసిల్దార్ ఇమ్రాన్ ఖాన్ సిఐ కుమారస్వామిలు చిన్నారి కి అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్,మాదారం ఎస్సై సౌజన్య ఆర్ ఐ ఎజాజుద్దీన్ ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఐఎన్టియూసి ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూరం దామోదర్ రెడ్డి మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్ యువజన నాయకులు పుట్ట శ్రీనివాస్ బాణేష్ అం జి స్థానిక నాయకులు పరుపతిరావు గంగు కన్నయ్య , కరుణ సీతాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# కిషన్ నాయక్ కు సర్పంచుల నివాళి

హైదరాబాద్ : మహబూబాబాద్ కు చెందిన మాజీ సర్పంచ్ భర్త కిషన్ నాయక్ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అతని ఆత్మహత్య ప్రభుత్వం అత్యనే అని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ ఆరోపించారు. కిషన్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని హైదరాబాద్ గన్ పార్క్ ,అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జేఏసీ చైర్మెన్ యాదయ్య గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించక, చేసిన అప్పుల వడ్డీరేట్లు కట్టక మాజీ సర్పంచులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ స్వరాజ్యానికి బాటలు వేస్తూ... అభివృద్ధి పనుల కోసం లక్షలు అప్పుగా తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసిన సర్పంచులు పిట్టలుగా రాలిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. చనిపోయిన కిషన్ నాయక్ కు కోటిరుపాయల ఎక్స్ గ్రేషియా ఇచ్చి , పెండింగ్ లో ఉన్న లక్షల నగదు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

# తాండూర్ మాత శిశు ఆసుపత్రిలో గర్భస్థ శిశువు మృతి

వికారాబాద్ : తాండూర్ మాత శిశు ఆసుపత్రిలో గర్భస్థ శిశువు మృతి చెందిన ఘటన వివాదస్పదమయింది. స్కానింగ్ కోసం గర్భిణీ (ఆశమ్మ)ని ప్రైవేట్ ఆస్పత్రికి న వైద్య సిబ్బంది తరలించారు. ఆసుపత్రిలో 10 గంటల తర్వాతనే స్కానింగ్ చేస్తారని చెప్పారు. దాంతో గర్భిణి ప్రైవేటు స్కానింగ్ సెంటర్ ను ఆశ్రయించింది. అప్పటికే గర్భిణి లో శిశువు మృతి చెందిందని రిపోర్ట్ వచ్చింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటూ ఆసుపత్రి ముందు బంధువులు ఆందోళనకు దిగారు.

# కామారెడ్డి లో మరోసారి బట్ట బయలైన కల్తీకల్లు బాగోతం

కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో మరోసారి కల్తీకల్లు కలకలం రేపింది. గాంధారి మండలం గౌరారంలో కల్తీకల్లు తాగి 30 మంది అస్వస్థకు గుర య్యారు. అందులో ఆరుగు రి పరిస్థితి సీరియస్‌గా ఉంది. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కామారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ ఐసీయూ లో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. గౌరారం లోని కల్లు దుకా ణంలో కల్లు తాగిన వారు వింతగా ప్రవర్తిస్తున్నారు. కుస్తీ పోటీల సందర్భంగా గౌరారం గ్రామానికి చెందిన గ్రామస్తులు కల్లు తాగారు. కల్లు దుకాణం పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.మంగళవారం కూడా కామారెడ్డి జిల్లాలో కల్తీకల్లు కలకలం రేపిన విషయం తెలిసిందే. నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామం లోని ఓ కల్లు దుకాణంలో కల్తీకల్లు తాగిన 22 మంది వింతగా ప్రవర్తించారు. అందరూ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుండటంతో కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.బాధితుల్లో నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్, సంగెం, హాజీపూర్, దుర్కి గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో, నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కల్తీ కల్లు కేసు ఘటన వెలుగు చూడటంతో ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు.

# మే 18న తెలంగాణ గోశాలల నిర్వహణ గోపోషకుల సదస్సు

హైదరాబాద్ : మానవజాతి మనుగడకు,వారు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపడంలో గోవులు కీలకమైన పాత్ర వహిస్తాయని మాత నిర్మలానంద యోగ భారతి పేర్కొన్నారు. సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో విజయ రామరావు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మే 18న లక్డికాపూల్, ఖైరతాబాద్ లోని శ్రీ వాసవి సేవా కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో గోవులను పోషిస్తున్న గోశాలల నిర్వాహకులు,గోపోషకుల సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. పంచ గవ్యాలతో మానవులకు ఎలాంటి రోగాలు రాకుండా ప్రకృతి సిద్ధంగా ఆరోగ్యంగా జీవించడం ఎలా, తెలంగాణ రాష్ట్రంలో గోవులను ఎలా సంరక్షించుకోవాలి, మానవుడి మనుగడ గోవుల ప్రాముఖ్యత తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించి భవిష్యత్తులో గో రక్షణపై అనేక తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు విద్యారావ్,కోటి శ్రీధర్, జస్వంత్ పటేల్,వాసుదేవాయ ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓయూలో ఎన్ఎస్యూఐ ఆవిర్భవ వేడుకలు

సికింద్రాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ ఎస్ యూ ఐ 55 వ అవిర్భవా దినోత్సవ వేడుకలు ఓయూ ఆర్ట్స్ కళాశాల అవరణాలో నిర్వహించి, ఎన్ఎస్యూఐ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు.అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చేసి విద్యార్థులకు సంబంధించిన సమస్యల పట్ల దిశ దశ సూచనలు ఇవ్వడం జరిగింది అన్నారు. భవిష్యత్తు లో విద్యార్థుల కు సమస్యలు ఉన్నట్లయితే వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసే విషయములో ముందు ఉంటామని తెలిపారు.ప్రజా పాలనలో విద్యార్థులకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసిందని.ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ గుర్తించి వారికి కీలక పదవులు ఇచ్చిందని తెలిపారు. ఎన్ ఎస్ యూ ఐ విద్యార్థుల సమస్యలు తీర్చడంలో ముందుంటుంది తెలిపారు.

# పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు

విశాఖపట్నం : మార్చి 2న పోలీస్ స్టేషన్లో జరిగిన ఘటనకు చెందిన సీపీ పుటేజీని 30 రోజుల తర్వాత ఎవరు విడుదల చేశారని జిల్లా మహిళా టిడిపి అధ్యక్షురాలు అనంతలక్ష్మి అన్నారు. కేవలం పోలీసులు కక్షపూరితంగానే వ్యవహరిస్తున్నారని,పోలీస్ కమిషనర్ ఈ కేసులో ఎంత సహకరించారని, టిడిపి ప్రభుత్వంలో పార్టీపరంగా ఎంతో కష్టపడ్డానని,ప్రస్తుతం ఆర్థిక నేరగాళ్లు అధికమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో నేను చెప్పుతో కొట్టిన వీడియో వైరల్ చేయడం ఎంతవరకు సమంజసమనిఆవేదన వ్యక్తం చేశారు. 2017 లో కొత్తూరు నరేంద్రకు 25 లక్షలురూపాయలు అప్పు ఇచ్చానని,దీనిపై కేసు కూడా పెట్టానని,కోర్టులో కేసు కూడా వేశాను గెలిచానని అన్నారు. ఆర్థిక నేరగాళ్ల ఆట కట్టించాలని,నాకు పూర్తి న్యాయం జరిగే వరకూ పోరాడుతానని అన్నారు.ఈ సమస్య నా వ్యక్తిగతం.. పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు.

# మాజీ మంత్రి కారుమూరిపై టీడీపీ నేతల ఫిర్యాదు

గుంటూరు : మాజి మంత్రి కారుమూరి నాగేశ్వర రావుపై టీడీపీ అధికార ప్రతినిధి కనపర్తి శ్రీను, మద్దిరాల మ్యాని, వేములపల్లి బుజ్జి పోలీసులకు పిర్యాదు చేసారు. మాజీ మంత్రి వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు వైసీపీ ఆత్మీయ సమావేశంలో అవాకులు చవాకులు పేలుతున్నాడు. గుంటూరు అవతల వాళ్ళని ఇవతల వాళ్ళని నరేకేస్తాం..పోడిచేస్తాం అని ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? మా నాయకుడు క్రమశిక్షణతో చేతులు కట్టేశాడు లేకపోతే వైసీపీ నేతలు కార్యకర్తలు రాష్ట్రం వదిలి ఎప్పుడో పారిపోయే వాళ్ళు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కారుమూరి నాగేశ్వరరావు కూడా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పల్నాడు, గుంటూరు, బాపట్ల ఏరియాలలో బడుగు బలహీన వర్గాలకు రక్షణ లేకుండా చేశారు. హత్యలు మానబంగాలు, అక్రమ కేసులు పెట్టి తీవ్ర మనోవేదన గురిచేసిన సంగతి ప్రజలకు తెలుసు. ప్రజలు వైసీపీకి 11సీట్లు ఇచ్చి చెంపచెళ్లు మనిపించినా సిగ్గురాలేదు. జగన్మోహన్ రెడ్డి పుణ్యమా అని5గురు పోలీసు అధికారులు అబసుపలయ్యి కేసులతో సతమతం అవుతున్నారు. కడప పర్యటనలో జగన్మోహన్ రెడ్డి పోలీసుల బట్టలు ఊడతీస్తానని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. గుంటూరులో అటువాళ్ళని నరుకుతామని, బట్టలుడతీస్తామని కారుమూరి మాట్లాడటం చూస్తే వైసీపీ నేతలు పిచ్చి పరాకాష్టకు చేరిందని పిస్తుందని అన్నారు.

# ఆర్ఎంపీ డాక్టర్ కి దేహశుద్ధి చేసిన స్థానికులు

పార్వతీపురం మన్యం : పార్వతీపురం పట్టణంలో వసంత కుమార్ హాస్పటల్ లో పైల్స్ సమస్యలకు వైద్యం చేసే సర్కార్ అనే ఆర్ఎంపీ డాక్టర్ హాస్పటల్ చుట్టు పక్కల నివసిస్తున్న స్థానికుల మహిళల అసభ్య కరమైన వీడియోలు తీశాడనే కారణంగా స్థానికులు ఆర్ఎంపీ డాక్టర్ కు దేహశుద్ధి చేసారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్లైన్ ఆఫ్లైన్ బెట్టింగులకు పాల్పడిన

# ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవు

## - పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



సిద్దిపేట : ఎవరైన క్రికెట్, మరే ఇతర బెట్టింగ్‌లకు పాల్పడిన ప్రోత్సహించిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ హెచ్చరించారు. ఇటీవల కాలంగా రాష్ట్రంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత అధికంగా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడిలో వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి సాధించడంతో ప్రతి ఒక్కరికి ఇంటర్ అందుబాటులోకి రావడంతో పాటు, సోషల్ మీడియా సైతం యువతకు మరింత చేరువ అయింది. తద్వారా మోసగాళ్ళ మోసపూరితమైన ప్రకటనలు, సందేశాలకు యువత ఆకర్షితులై సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ పాటు, ఇతరత్రా బెట్టింగ్‌ల వైపు యువత తొంగిచూడమే కాకుండా ఇంటి సభ్యులకు తెలియకుండా వీటిల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా పూర్తిగా నష్టపోవడంతో పాటు కొన్ని సందర్భాల్లో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరి పై వుందని. ముఖ్యంగా ప్రస్తుతం దేశంలో ఐపిల్ సిజన్ ప్రారంభం అయింది. ఇది దృష్టిలో వుంచుకోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా వారు క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అయ్యే సమయాల్లో వారి ప్రవర్తతో పాటు, వారు సెల్‌ఫోన్లలో మాట్లాడే సంభాషణపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు సూచించారు.పోలీస్ కమిషనరేట్ పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు గాను పెద్దఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని, ఇందుకోసం ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించు కోవడంతో పాటు, టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలను వినియోగించుకొవడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో ఎవరైన బెట్టింగ్‌లను పాల్పడిన, పోత్సహించిన వారి వట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎవరైన బెట్టింగ్‌లకు పాల్పడినట్లుగా సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా డయల్ 100కు సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# అమరావతిలో చంద్రబాబు ఇంటి నిర్మాణం

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాజధాని అమరావతిలో తన ఇంటి నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం దాదాపు 9 గంటల ప్రాంతంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం ఏడున్నర గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి సతీమణి భువనేశ్వరి, కుమారుడు ఏపీ మంత్రి నారా లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనవడు నారా దేవాన్షులతో కలిసి వెలగపూడి బయలుదేరారు. శుభ ముహూర్తాన వెలగపూడిలో నిర్మించనున్న ఇంటికి శంకుస్థాపన చేశారు.రాజధాని పరిధిలో ఇల్లు కట్టుకుంటానని చంద్రబాబు గతంలోనూ చెప్పారు. 2024 డిసెంబర్లో వెలగపూడి పరిధిలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో భూమిని గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి కొనుగోలు చేశారు. తమ ప్రాంతంలో సీఎం చంద్రబాబు ఇల్లు నిర్మించుకుంటున్నందుకు వెలగపూడి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వారు సీఎం కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేయనున్నారని సమాచారం. భూమికి సంబంధించి ప్లాట్ రిజిస్ట్రేషన్ సైతం పోతాయి. ఇంటి నిర్మాణం భూమి పూజ, శంకుస్థాపన ఉన్నందున గత వారం నుంచి అక్కడ భూమి చదును చేసే పనులు చేశారు. మొత్తం 1455 చదరపు గజాల విస్తీర్ణంలో సీఎం చంద్రబాబు వెలగపూడిలో కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నారు. జీ ప్లస్ వన్ లో ఇంటి నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం. ఎస్.ఆర్.ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఏడాదిలోపు ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని టీడీపీ అధినేత భావిస్తున్నారు. ఈ మేరకు కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఇంటి నిర్మాణంపై పలు సూచనలు చేశారు. కంటి ఆవరణలో పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కలు ఎక్కువగా పెంచాలని చంద్రబాబు నిర్ణయించారు

నిబద్ధతకు గుర్తు

రాష్ట్ర రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబు నూతన ఇంటి నిర్మాణానికి నేడు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబుతో పాటు నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “ఇవాళ నాకు, నా కుటుంబానికి ఎంతో భావోద్వేగభరితమైన రోజుగా నిలిచిపోతుంది. కోట్లాది మంది ప్రజల కలల ప్రతిరూపం రాజధాని అమరావతిలో మా కొత్త ఇంటి నిర్మాణానికి మా నాన్న చంద్రబాబు గారు భూమి పూజ చేయడాన్ని ఎంతో గర్వంగా, కృతజ్ఞతా భావంతో వీక్షించాను. మన రాష్ట్ర భవిష్యత్తు కోసం మా నాన్న ఊహించిన ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని నిర్మించాలన్న కలకు ఇది పునరుజ్జీవనం. ఈ పవిత్రమైన కార్యక్రమంలో నా తల్లి భువనేశ్వరి, నా శక్తికి మూలస్తంభం నారా బ్రాహ్మణి, నా ముద్దుల కుమారుడు దేవాన్ష్ తో కలిసి పాల్గొనడం ఒక దీవెన వంటిది. ఇది మా ఇల్లు మాత్రమే కాదు... మా నిబద్ధతకు ప్రతీక. అమరావతిని మర్చిపోలేదు... దీన్ని మరింత బలంగా, మరింత పట్టుదలతో, ఎన్నడూ లేనంత మరింత అందంగా పునర్ నిర్మిస్తున్నాం. మన రాజధాని మళ్లీ పునరుజ్జీవం పొందుతోంది... అలాగే మన ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తి కూడా దూసుకుపోతోంది” అంటూ లోకేశ్ పేర్కొన్నారు.

# గ్యాస్ సిలెండర్ రేట్లు పెంచడం అమానుషం

**పేద,సామాన్య జనం నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు - దేశంలోనే అత్యధికంగా పెట్రోల్,డీజిల్ రేట్లు ఏపీలోనే..**

**పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి డిమాండ్**



బద్వేలు : గ్యాస్ సిలెండర్ రేట్లు పెంచడం అమానుషమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు.సామాన్యుడి వంటింట్లో గ్యాస్ ధరలు మంటలుపుట్టిస్తున్నాయన్నారు. గత కొన్ని రోజులుగా వాణిజ్య సిలెండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగ దారులకు వాత పెట్టిందన్నారు. వంట గ్యాస్ ధరను కేంద్రం రూ 50 పెంచి పేద,సామాన్య జనం నడ్డి విడిచిందన్నారు. ఉజ్వల్ యోజన పథకం క్రింద అందచేసే సిలెండర్ పై కూడా రూ 50 భారాన్ని మోపారాన్నారు.సామాన్య, మధ్య తరగతి ప్రజలకు గ్యాస్ ధరలు భారం అవుతున్నాయన్నారు.14.2 కేజీల ఎల్ పి జి గ్యాస్ సిలెండర్ ధర రూ 853 నుంచి రూ 903కు చేరిందన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మూలిగేనక్కపై తాటిపండు పడ్డట్టు సిలెండర్ రేటు పెంచడం భారంగా మారిందన్నారు.కూరగాయల ధరల నుంచి కిరాణా సరుకుల వరకు ధరలు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు చాలామందికి అందడం లేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్టు ప్రకటించారని, ముందుగా వినియోగదారులు సిలిండర్ ధర ఏజెన్సీలకు చెల్లించాలని, రెండు రోజుల్లో ఆ డబ్బులు మొత్తం సబ్సిడీ కింద వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారన్నారు. ఈ మేరకు తొలివిడత కింద ఇప్పటివరకూ ముప్పై, నలభై శాతం మందికి సిలిండర్ రాయితీ డబ్బులు వారి ఖాతాకు జమ కాలేదన్నారు. తొలి సిలిండర్ సరఫరాకు మార్చి 31 న గడువు ముగిసిందని, ఏప్రిల్ 1 నుంచి రెండవ సిలెండర్ పంపిణీ ప్రక్రియ మొదలైందన్నారు. మొదటి సిలిండర్ సబ్సిడీ తమకు వర్తిస్తుందో లేదోనని మిగిలిన గ్యాస్ వినియోగ దారులు ఆందోళనచెందుతున్నారన్నారు.కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

**దేశంలోనే అత్యధికంగా పెట్రోల్ ,డీజిల్ రేట్లు మన రాష్ట్రంలోనే...**

దేశంలోనే అత్యధికంగా పెట్రోల్ ,డీజిల్ రేట్లు మన రాష్ట్రంలోనే అధికంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ లో లీటర్ పెట్రోల్ ధర రూ 109.22, కర్ణాటక లో లీటర్ పెట్రోల్ ధర 102.92, తమిళనాడు లో లీటర్ పెట్రోల్ ధర రూ 101.84 ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలలో మనకంటే తక్కువ రేట్లు వున్నాయన్నారు. అన్ని రాష్ట్రాల కన్నా డీజిల్,పెట్రోల్ ధరలు రూ 10 తగ్గి ఉండేలా చేస్తామని కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో చెప్పారని, ఆ మేరకు కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

# దుబ్బాక గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట : దుబ్బాక లోని హబ్సిపూర్ మహాత్మ జ్యోతి బా పూలే తెలంగాణ బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సందర్శించారు. ఈ గురుకులంలో 391 మంది విద్యార్థులు ఉంటున్నారని డార్మెంటరీ గదులు మరుగుదొడ్లు రిపేర్లు, కిటికీలు తలుపులు రిపేర్లు మరియు డైనింగ్ హాల్ కావాలని ప్రిన్సిపల్ భూపాల్ రెడ్డి కలెక్టర్ కు తెలిపారు. వంట గదిలో వండిన అన్నం కూరలను పరిశీలించి రుచి చూసి కూరల్లో ఉప్పు సరి సమానంగా వేయాలని, తాజా కూరగాయలు వాడాలని, వంటగది పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని, కొత్త డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వంట సిబ్బందికి తెలిపారు. స్టోర్ గదిని పరిశీలించి పసుపు, కారం, నూనె ఇతరత్రా వస్తువులు నాణ్యత పరమైన మాత్రమే వాడాలని కాలం చెల్లిన సరుకులు వాడకూడదని ఎల్లప్పుడూ స్టాక్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని తెలిపారు. మరుగుదొడ్లను పరిశీలించి ఎల్లప్పుడూ రన్నింగ్ వాటర్ వచ్చే విధంగా మరియు బ్లీచింగ్ చేయాలని తెలిపారు. 8వ తరగదిలలోకి వెళ్లి పిల్లలతో అప్యాయంగా పలకరించారు. అన్ని సదుపాయాలు బాగున్నాయా అని విద్యార్థులను అడగ్గా బాగానే ఉన్నాయని తెలిపారూ. స్టడీ అవర్స్ లో గణిత సమస్యలను ఎక్కువగా ప్రాక్టీస్ చెయ్యాలని సూచించారు. మీకు కావాల్సిన ప్రస్తుతం దర్మటరి 2 గదులు, మరుగుదొడ్ల డోర్స్, తరగతి గదులకు కిటికీలు తలుపులు, మైదానంలో కూర్చొని తినే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# కార్యకర్తకు దక్కిన పదవి

- ఇల్లందకుంట ఆలయ చైర్మన్‌గా ఇంగిలె రామారావు
- కరుడుగట్టిన కాంగ్రెస్‌వాదికి అధిష్టానం గుర్తింపు

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



కార్యకర్తకు పదవి దక్కింది. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన కార్యకర్తను అధిష్టానం గుర్తించింది. దీంతో ఆ పార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ కష్టకాలంలో ‘చేతి’ని వీడకుండా.. హోరాహోరిగా సాగిన ఉప ఎన్నికల సమయంలో ఎందరో ప్రయత్నాలు చేసినా మూడు రంగుల కాంగ్రెస్ జెండాను ఆయన వీడలేదు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా రాజకీయవర్గాల్లో పేరుగాంచారు. ఆయనే ఇల్లందకుంట మండల పరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన ఇంగిలె రామారావు. సుమారు పాతికేండ్లుగా ఒకే పార్టీని నమ్ముకుని పార్టీ కార్యకర్తగా మొదలై నాయకుడిగా ఉంటూ.. హస్తం పార్టీ బలోపేతానికి కీలకంగా పని చేస్తున్నారు. హస్తం పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడిగానూ పని చేశారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆయనకు అపరభద్రాద్రి ఇల్లందకుంట సీతారామచంద్రుల వారి దేవస్థాన చైర్మన్‌గా పార్టీ అవకాశమిచ్చింది. పదవులతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంగిలె రామారావు ఏండ్లుగా పని చేస్తున్నారు. నిబద్ధతతో ఒకే పార్టీలో పని చేస్తే తప్పకుండా పదవులు వాటంతటా అవే వరించి వస్తాయని ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.

**పార్టీ పెద్దలకు ధన్యవాదాలు: ఇల్లందకుంట ఆలయ చైర్మన్ రామారావు**

ఇల్లందకుంట ఆలయ కమిటీ చైర్మన్‌గా నన్ను నియమించిన పార్టీ పెద్దలు, అధిష్టానానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నారు. స్థానిక హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి సురేఖకు ధన్యవాదాలు. ఆలయ కమిటీ చైర్మన్‌గా శక్తివంచన లేకుండా పాలకవర్గ సభ్యుల సహకారంతో పని చేస్తాను. ఆలయ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తాను.

# బీజేపీ పట్టణ కార్యదర్శిగా చిక్కుడు మల్లేశం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ శాఖ కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు చిక్కుడు మల్లేశం నియా మక య్యారు. ఈ సందర్భంగా గురువారం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ నియా మక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీకి చిక్కుడు మల్లేశం చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియా డారు.విశ్వసనీయత,విలువలు గల కార్యకర్తగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మల్లేశం నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని అభినం దించారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి వారిని గౌరవిస్తామని తెలిపారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం అందరూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపు నిచ్చారు.తదనంతరం మల్లేశం మాట్లాడుతూ పార్టీకి తాను చేస్తున్న సేవలు గుర్తించి పట్టణ శాఖ కార్యదర్శిగా తనను నియమించినందుకు పార్టీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.వేములవాడలో బీజేపీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి,మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# గాంధీనగర్‌లో కార్డెన్ సెర్చ్

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**




నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం గాంధీనగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు,8మంది ఎస్ఐలు,74 మంది సిబ్బందితో గాంధీ నగర్‌లో సోదాలు ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో కొత్త వ్యక్తులకు కిరాయిలకు ఇళ్లను ఇవ్వవద్దని, గుర్తుతెలియని వ్యక్తుల సంచరించినట్లయితే సమాచారం అందించాలని అన్నారు. సరైన పత్రాలు లేని 56 బైకులు, నాలుగు ఆటోలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నెంబర్ ప్లేట్లలో మార్పులు చేసి ఉన్నటువంటి వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అందులో కొన్ని వాహనాలకు అసాంఘిక కార్యకలాపాలలో ప్రమేయం ఉన్నట్లుగా సమాచారం ఉన్నదని అన్నారు.

# డాక్టరేట్ పట్టా ఓదెలుకు ఘన సన్మానం

**వేద న్యూస్, వేలేరు**

ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో డాక్టరేట్ సాధించిన కుమ్మరి ఓదెలను ఘనంగా సన్మానించారు. వేలేరు తెలంగాణ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సహ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ తెలుగు విభాగంలో డాక్టర్ పూర్ణ ప్రజ్ఞ చంద్రశేఖర రావు గారి పర్యవేక్షణలో వరంగల్ జిల్లా కథా సాహిత్యం పరిశీలన అనే అంశంపైన పరిశోధన పూర్తి చేసినందున డాక్టరేట్ పట్టా లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా మొగుళ్ళపల్లి మండలం గుడిపహాడ్ అనే గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న సమ్మయ్య సారమ్మ దంపతులకు జన్మించిన ఓదేలుకు చిన్నప్పుడే పోలియో సోకింది. అంగవైకల్యం తన ఉన్నత లక్ష్యం ముందు ఓడిపోయింది. మొక్కవోని ధైర్యంతో తన కుటుంబ సభ్యుల సహకారంతో ఎంతో కష్టపడి గ్రామీణ ప్రాంతం నుంచి ఉస్మానియా యూనివర్సిటీ స్థాయి వరకు ఎదిగారు. ప్రస్తుతం వేలేరు తెలంగాణ గురుకుల పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ కుమార్ తోటి సిబ్బంది స్వజని, శారద, నాగజ్యోతి, నరసయ్య, శ్రీనివాస్, సందీప్, హుస్సేన్ రాజేందర్ చంద్రమౌళి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.



# రైతులు నష్టపోతే బాధ్యత ప్రభుత్వానిదే..!

■ ఐకెపి కేంద్రాలలో వడ్ల కాంటాలను వెంటనే ప్రారంభించాలి



**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

వేములపల్లి మండలం సల్కునూరు బొమ్మకల్లు రోడ్లో ఐకెపి కేంద్రాలను గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు,జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, సిపిఐ మండల కార్యదర్శి జిల్లాయాదగిరి, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు మద్దిరాలరంగారెడ్డి, మద్దిరాల వెంకట్ రెడ్డి తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఐకెపి కేంద్రాలలో ధాన్యాన్ని తోలి పది పదిహేను రోజులు కావస్తున్నా రైతుల ధాన్యాన్ని కాంటావేయడంలో కాలయాపన చేస్తున్నారని అన్నారు. నిన్న వచ్చి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తున్నామని ప్రకటించుకోకపోవడం జరిగిందన్నారు. ఐకెపిస్ కేంద్రానికి సంబంధించినటువంటి వారు యుద్ధ ప్రాతిపదిక పైన రాశుల మీదికి పట్టాలు ప్రొవైడ్ చేయాలని వారన్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడటం వలన రాగల రోజులలో ఉరుముల, మెరుపులతో, గాలివానలతో కూడిన వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వీటిని ఆలోచనలో ఉంచుకొని వెంటనే కాంటాలు వేసి అక్కడ నుంచి బస్తాలు తరలించాలన్నారు. హమాలీలు లేరని బస్తాలు రాలేదని లారీలు దొరకలేదని ఇలాంటి కుంటి సాగులు చెప్పినట్లయితే నష్టపోయేది రైతులు మాత్రమేనని తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే వెంటనే కాంటా వేయాలని లేనిపక్షంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు మద్దిరాల రంగారెడ్డి,మద్దిరాల వెంకటరెడ్డి,రైతులు రోశయ్య, సత్యం, సైదులు,చిట్టికల యశోద, లింగమ్మ, లక్ష్మమ్మ, కలమ్మ, రేఖఎల్లయ్య, గురజారాణమ్మ, రేఖ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



కేంద్రంలో పెంచిన వంట గ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరలు వెంటనే ఉపసహరించుకోవాలని ఖాళీ గ్యాస్ సిలిండర్లతో సిపిఎం జిల్లా కార్యదర్శి ముషం, సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అనాల్దాసు గణేష్, రమేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ రేట్లు తగ్గించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచడం దారుణమని విమర్శించారు. దీనివల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు సాధారణ వినియోగదారులతో పాటు మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరను ఉపశమరించుకోవాలని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యవసర సరుకుల ధరలపై నియంత్రణ చేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం అన్ని రకాల సరుకులు వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు విపరీతంగా పెంచారన్నారు. 2014 బిజెపి అధికారంలోకి రాకముందు గ్యాస్ సిలిండర్ 450 రూపాయలు ఉండేదని కానీ ఇప్పుడు బిజెపి వచ్చిన తర్వాత వెయ్యి రూపాయలకి గ్యాస్ సిలిండర్ పెంచడం చాలా దారుణమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఏగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, గురిజాల శ్రీధర్, సిపిఎం నాయకులు నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, బెజుగం, సురేష్, గుండు రమేష్, గోవిందు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## జమ్మికుంటలో 'భద్రాద్రి' బ్యాంక్ ప్రారంభం

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ లైన్లో భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బ్రాంచ్‌ను ఆ బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. స్ట్రాంగ్ రూంను శ్రీరామ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ ముక్క రాము, క్యాష్ కౌంటర్‌ను జిల్లా సహకార అధికారి సముద్రాల రామానుజాచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడారు. ఒక్క శాఖతో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి 23వశాఖను జమ్మికుంటలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. తమ బ్యాంకులో అన్ని బ్రాంచ్‌లలో కలిపి 70 వేల మంది ఖాతాదారులు ఉన్నారని వెల్లడించారు. బ్యాంక్ రూ.100 కోట్ల టర్నోవర్ కలిగి ఉందని పేర్కొన్నారు. తమ బ్యాంకు గృహ, వ్యాపార, చిన్న తరహా పరిశ్రమలు, ఎడ్యుకేషన్‌తో పాటు అన్ని రకాల రుణాలు అందిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ ఉదయ్ ప్రతాప్, వెంకటేశ్వరరావు, సీఈవో దాసరి వేణుగోపాల్, డైరెక్టర్లు రాజారావు, పిచ్చయ్య, నాగ శ్రీనివాస్, జీవన్ రామ్, జమ్మికుంట పుర ప్రముఖులు రాజేంద్రప్రసాద్, భీమ్ రావు, నరేందర్, వెంకటేశ్వర్లు, సుంకరి రమేశ్, బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## యూపీఎస్సీ గెలుపుకు సూత్రాలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సిటీ కాలేజీలో తెలంగాణ స్కిల్స్ అండ్ నోలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తంగా "యూపీఎస్సీ పరీక్ష లలో గెలుపుకు అనుసరించవలసిన సూత్రాలు" అనే అంశంపై ఒక సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం సివిల్ సర్వీసులపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సదస్సులో యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించటం ప్రణాళిక, పట్టుదలలతో పాటు తార్కిక ఆలోచనావిధానం, భావోద్వేగ సమతుల్యతతో సాధ్యమని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీ కృష్ణప్రదీప్, చీఫ్ మెంటార్ శ్రీ భవానీ శంకర్ విద్యార్థులకు వివరించారు.తమ అనుభవాలను, పరీక్షలకు తయారీపై కీలకమైన పద్ధతులను విద్యార్థులతో పంచుకున్నారు. వారు కరెంట్ ఎఫైర్స్ పై అవగాహన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి డా.జెవిఎన్. మల్లికార్జున కన్వీనర్ గా, డా. భాస్కర్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. వారు కూడా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సరైన మార్గదర్శకత్వం వలన విద్యార్థులు విజయం సాధించగలరని తెలిపారు. సదస్సు చివరలో ప్రశ్నలు–సమాధానాల సెషన్ నిర్వహించబడింది, ఇందులో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డా.శ్రీదేవి, డా.నాగరాజు, డా.రవీంద్ర పాల్గొన్నారు.

## కేజ్ కల్చర్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మధ్య మానేర్ రిజర్వాయర్ జలాశయ పరిధిలో గల చీర్లవంచ లో ఫిషిన్ ఫార్మ్ ఇండియా వారి ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ ను యూనిట్లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం తనిఖీ చేశారు. రిజర్వాయర్ లో వృత్తాకార, పది 10 మీటర్ల డయా సర్క్యులర్ బోనులు, ఎనిమిది 5%ఇ%5 మీటర్ల సైజు గల కేజ్ కల్చర్ ను యూనిట్లను ఏర్పాటు చేసి, దానిలో దాదాపు 4.2 లక్షల విత్తనాలను నిల్వ చేశారు. ప్రస్తుత మీడ్ మానేర్ రిజర్వాయర్ నీటి మట్టం తగ్గుముఖం పడుతుందని, ఎక్కువ పంజారాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని, ప్రస్తుత నీటి మట్టం 8 టిఎంసిలు మాత్రమే ఉన్నందున వేసవి కాలం, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మరిన్ని హెచ్చుతగ్గులు సంభవించే అవకాశం ఉన్నందని ఫిషిన్ ఫాం ప్రైవేట్ లిమిటెడ్ వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.మిడ్ మానేర్ రిజర్వాయర్ లో నీరు ఎక్కువ కాలం, అధిక లోతు ఉండి ఇతర జలచరాల భద్రతకు భంగం కాకుండా ఉండే అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకొని కేజ్ కల్చర్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## నడిపించే నాయకుడు ఎవరు?

మొదటి పేజీ తరువాయి

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బీజేపీలో చేరారు. అప్పటి నుంచి ఆయన గులాబీ పార్టీలో నిర్వహించిన పదవులు ఖాళీగానే ఉండటం గమనార్హం. ఇక జనగామ మిగతా అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. అధికార పార్టీని ఢీకొంటూ ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ ఆ మేరకు కార్యక్రమాలు చేపట్టి ప్రజలను పెద్దగా ప్రభావితం చేయగల సత్తా ఏ మేరకు ఉంటుందనేది ఎన్నికల సమయంలోనే తెలుస్తుంది. ఈ క్రమంలోనే రజతోత్సవ వేళ సభకు జన సమీకరణ ఏ మేంకు జరుగుతుందనేది? కూడా సభ ద్వారానే తేలనుంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి బీఆర్ఎస్ రజతోత్సవ సభను 10 లక్షల మందితో నిర్వహించాలని కేసీఆర్ ప్లాన్ చేశారు. కాగా, ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఏ మేరకు ప్రజల తరలింపు ఉంటుందో చూడాలి.

### కేడర్‌లో జోష్ నింపే లీడర్ ఎక్కడ?

ఏ పార్టీకైనా లీడర్ ఉంటేనే కేడర్‌లో జోష్ ఉంటుంది. అలాంటి రెండేండ్లుగా వరంగల్ జిల్లా సారథి లేక ఆ పార్టీ కేడర్‌లో ఓ రకంగా నైరాశ్యమే నెలకొంది. ఇక వర్ధన్నపేట సెగ్మెంట్ మాత్రమే కాదు.. మిగతా ఉమ్మడి వరంగల్‌లోని అసెంబ్లీ సెగ్మెంట్లలో సైతం కేడర్‌లో జోష్ నింపుతూ.. కార్యకర్తలకు అండగా నిలిచేలా పార్టీ సమావేశాలు, ప్రోగ్రామ్స్ ఎప్పటికప్పుడు జరగకపోవడంతో.. ఇతర పార్టీల వైపు గులాబీ కేడర్ చూసే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫొటోలకు ఫోజులు ఇచ్చే లీడర్లే తప్పా నిజంగా ఉద్యమకాలం నుంచి పార్టీనే నమ్ముకున్న వారికి ప్రయారిటీ ఇచ్చే ధోరణి గులాబీ పార్టీలో లేదని, ఉద్యమకారులకు అసలు గౌరవమే దక్కడం లేదని కొందరు బాహాటంగానే వెల్లడిస్తున్నారు. పోరాటాలే ఊపిరిగా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా వరంగల్ వేదికగా గతంలో జరిగిన 'పోరుకేక', 'పొలికేక', 'రిలే నిరాహార దీక్షలు', 'నిరసనలు' వంటి ఎన్నో కార్యక్రమాలకు బీఆర్ఎస్ కేడర్ కేంద్రబిందువుగా ఉంది. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల కాలం తర్వాత ప్రస్తుతం అలాంటి సీన్ లేదని కొందరు అంటున్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న వారిని కనీసంగా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పార్టీ కేడర్ తమ దారి తాము చూసుకున్నదని పేర్కొంటున్నారు. పార్టీ రజతోత్సవ సభ విజయవంతం చేయడానికి ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో పార్టీ అధినేత సమావేశమవుతున్నారని, అయితే, ఉమ్మడి జిల్లా నేతలు ఆయా సెగ్మెంట్లలో స్థానిక లీడర్లు, కార్యకర్తలతో ఏ మేరకు సమన్వయం చేసి.. సమాయత్తపరుస్తారు? అనే దానిపైన సభకు జనం తరలింపు, సక్సెస్ వంటివి ఆధారపడి ఉంటాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ చాంపులాల్ జాతర

**వేద న్యూస్, సూర్యాపేట ప్రతినిధి :**



సూర్యాపేట జిల్లా చివేంల మం డలంలోని లక్ష్మీ నాయక్ తండ పరిధిలోని గుడి తండాలో గిరిజ నుల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ చాంపులాల్ మహారాజ్ పండుగ మహోత్సవం స్థానిక గుడి వద్ద గిరిజన సంప్రదాయంలో అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ జాతర వేడుకలో దేవుని వేడుకొని మొక్కలు చెల్లించుకొని వారు మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన చంపులాల్ 150 సంవత్సరాలు చరిత్ర కలిగిన దేవుడి గుడికి అభివృద్ధికి నిధులను పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ నుండి ప్రభుత్వం తరపున కోటి రూపాయలు మంజూరు చేయించి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్త, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ముదిరెడ్డి రమణారెడ్డి, మాజీ కౌన్సిలర్ లు జ్యోతి కరుణాకర్, వల్దాసు దేవేందర్,నాయకులు యాట ఉపేందర్, సైదిరెడ్డి, పిల్లల రమేష్ నాయుడు, ధర్మానాయక్, చివేముల మండల కాంగ్రెస్ నాయకులు ధరావత్ రవీందర్ నాయక్, మోహన్ నాయక్, అనిల్ నాయక్, నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభకు పట్టం నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్

**వేద న్యూస్, హైదరాబాద్:**

డిగ్రీలో అత్యున్నత గ్రేడు సాధించి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మెరిట్ ఆధారంగా స్కాలర్ షిప్పులు, ఆర్థిక సహకారం అందిస్తున్నది. ఈ పథకంలో భాగంగా సిటీ కళాశాల ఎం.కామ్. విద్యార్థులు ఐదుగురు 2024-25 విద్యా సంవత్సరానికిగాను జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద నలుగురు విద్యార్థులు మూడు లక్షల చొప్పున, ఒక విద్యార్థి లక్షా యాభైవేల చొప్పున మొత్తం పదమూడు లక్షల యాభైవేలు అందుకున్నారు. కాలేజీలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో వారిని అభినందించారు ప్రిన్సిపాల్, కామర్స్ అధ్యాపక బృందం. వారి అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఈ స్కాలర్ షిప్పు లభించిందని, ఇది వారి కృషిని, పట్టుదలని సూచిస్తుందని తెలిపారు ప్రిన్సిపాల్. వారు భవిష్యత్తులో మరింత ఉన్నతిని సాధించాలని ఆకాంక్షించారు.

## వడ్డేపల్లి చెరువులో గుర్తుతెలియని మృతదేహం

**వేద న్యూస్, కాజీపేట :**



కాజీపేట పట్టణానికి అతి సమీపంలో ఉన్న వడ్డేపల్లి చెరువులో ఒకగుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కాజీపేట సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. అతని వయసు సుమారు 23 సంవత్సరాలు ఉంటుందని, వడ్డేపల్లి చెరువులో పడి చనిపోయి ఉన్నట్టు గుర్తించామని, ఇట్టి గుర్తు తెలియని వ్యక్తి చామన చాయ రంగు ఒంటిపై నల్లటి లోయర్ ధరించి ఉన్నాడని, ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే కాజీపేట పోలీస్ స్టేషన్‌కి 8712685246, 8712685008 గల ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలుపగలరన్నారు.



## బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

ఇటీవల మెట్ పల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పసునూరి శ్రీనివాస్ ను మెట్ పల్లి పట్టణం దుబ్బవాడకి చెందిన 21 వార్డు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పద్మశాలి సమాజానికి చెందిన న్యాయవాది శ్రీనివాస్ న్యాయవాదుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం మాకెంతో గర్వంగా ఉందన్నారు. సంఘం అధ్యక్షులు భీమానతి సత్యనారాయణ, నాయకులు అందె ఉదయ్ కుమార్, చిలుక లక్ష్మణ్, పోతు రామ్ దాస్, భీమానతి ప్రకాష్, చంద్రకాంత్, బాస రవి, బి. సత్యం, తిరునగరి కిషోర్, చాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

మెట్‌పల్లి పట్టణంలోని మహాలక్ష్మి దేవాలయం వద్ద ఉన్న ఫంక్షన్ హాల్ లో ఎలక్ట్రిషన్ యూనియన్ సమావేశం జరిగింది. ఎలక్షన్ అధికారి తరి రాజశేఖర్ అధ్యక్షతన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు జరిగాయి ఫలితాల్లో భాగంగా అధ్యక్షులుగా మీర్జా అజిజుల్లా బేగ్ (తోఫిక్), ఉపాధ్యక్షులుగా సంగర్తి రవి, కార్యదర్శిగా ఎండి వాజిద్, సహాయ కార్యదర్శిగా నేరెళ్ల నరేష్, క్యాషియర్ గా సయ్యద్ అబిద్, సలహాదారులుగా కాదాసు శ్రీనివాస్, ఎండి కాసిం, మరియు కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని, అభివృద్ధి దిశగా తన వంతు కృషి చేస్తానని అన్నారు.



## కోనరావుపేటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి :**

కోనరావుపేట మండలం రామన్నపేట, కొలనూరు గ్రామాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు.గ్రామాలలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం అందరూ రక్షించుకోవాలని, రాజ్యాంగాన్ని నామరూపాలు లేకుండా చేయాలని బిజెపి కుట్ర చేస్తుందన్నారు.రాజ్యాంగాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో ఎఐసిసి, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నాలుక సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి గొట్టె రుక్మిణీ,అయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073